కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -214 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 15-08-2026 శనివారం పేజీలు : 4




# పెట్టుబడులకు గ్లోబల్ పిలుపు



● కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ● డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్ ● ఇన్వెస్ట్ తెలంగాణే థీమ్ ● పెట్టుబడులే ప్రధాన లక్ష్యం ● ఫ్యూచర్ సిటీపై ఫోకస్ ● ప్రపంచానికి తెలంగాణ బిజినెస్ షో ● డిఫెన్స్ నుంచి గ్రీన్ ఎనర్జీ వరకు ● స్టార్టప్‌లకు అంతర్జాతీయ వేదిక ● భారీ పెట్టుబడులకు బిగ్ ప్లాన్

**న్యూస్ డెస్క్, 14 ఆగస్టు (బిఎన్ఎస్):** తెలంగాణలో పెట్టుబడుల ఆకర్షణకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తాజాగా సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ‘ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0’ నిర్వహణకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో మూడు రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహించాలని నిర్ణయించింది. గతేడాది నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కంటే ఈసారి మరింత విస్తృత స్థాయిలో సదస్సును నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయనుంది. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ ప్రధాన థీమ్‌గా.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0ను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు వివరించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సదస్సు ఏర్పాట్ల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా

మిగతాది 2 లో..

# రేవంత్‌కు హరీశ్ స్ట్రాంగ్ కౌంటర్

కాళేశ్వరంపై మాటల యుద్ధం
అబద్ధాలతో చరిత్ర మారదు
రైతులను మభ్యపెట్టొద్దు
జలహక్కులపై బీఆర్ఎస్ పోరు
18న జీఆర్ఎంబీ ముట్టడి



2 లో

**న్యూస్ డెస్క్, 14 ఆగస్టు (బిఎన్ఎస్):** కాళేశ్వరం ప్రాజెక్టు, తెలంగాణ సాగునీటి రంగంపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధసత్యాలు, అబద్ధాలు, కట్టుకథలతో కాళేశ్వరం ప్రాధాన్యతను గానీ, చరిత్రను గానీ మార్చలేరని స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి రాకుండా ఎవరూ అడ్డుకోలేరంటూ సోషల్ మీడియా వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**కాళేశ్వరం లేకుంటే ఆ నీళ్లు ఎక్కడివి?**

కాళేశ్వరం ప్రాజెక్టు లేకుండానే రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంటలు పండాయని సీఎం రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు.

# పార్టీ గీత దాటితే చర్యలు



2 లో

రాజగోపాల్ వ్యాఖ్యలపై గరం
హైకమాండ్‌కు నివేదిక
క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వేటు
సీఎం అయినా నేత అయినా ఒకటే
పదవులపై హైకమాండ్‌దే నిర్ణయం
కాంగ్రెస్‌లో ముదిరిన విభేదాలు

**న్యూస్ డెస్క్, 14 ఆగస్టు (బిఎన్ఎస్):** కాంగ్రెస్ పార్టీతో ఏమాత్రం సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు శుక్రవారం ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం సహించరాని విషయం అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అధికార పార్టీలో నిప్పు రాజేశాయి.

# జనగణనకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

● 40 ప్రశ్నలతో గెజిట్ నోటిఫికేషన్
● సెప్టెంబర్ 1 నుంచి తొలి విడత
● కులం వివరాలూ సేకరణ
● కోవిడ్ టీకాపైనా ప్రశ్న
● ఇల్లు.. నీరు.. విద్యుత్ వివరాలు
● పూర్తిగా డిజిటల్ విధానంలో లెక్కలు

**న్యూస్ డెస్క్, 14 ఆగస్టు (బిఎన్ఎస్):** దేశ ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న జనగణన-2027 ప్రక్రియకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేసింది. ఈ జనాభా లెక్కల సేకరణలో పౌరుల నుంచి వివరాలు సేకరించడానికి ఉద్దేశించిన 40 ప్రశ్నల జాబితాను కేంద్ర హోంశాఖ అధికారికంగా నోటిఫై చేసింది. ఈసారి జనాభా లెక్కల ప్రక్రియ తొలి విడతను రాబోయే సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభించనున్నట్లుగా వెల్లడించింది.

2 లో

# స్మార్ట్ కార్డులపై పొలిటికల్ వార్




2 లో

● మోడీ ఫోటో లేకపోవడంపై బీజేపీ ఫైర్
● సీఎం,మంత్రి ఫోటోలపై బీజేపీ అభ్యంతరం
● రేషన్ బియ్యంలో కేంద్రం వాటాపై వాదన
● సంగారెడ్డి సభపై బీజేపీ నేతల హెచ్చరిక
● కార్డు డిజైన్ చుట్టూ ముదురుతున్న వివాదం

# పోలీసులకు సేవా పతకాలు

● తెలంగాణకు 15, ఏపీకి 21 పతకాలు
● సాహస సేవలకు గ్యాలంట్రీ మెడల్స్
● 197 మంది వీరులకు ప్రత్యేక గుర్తింపు
● సీబీఐ అధికారులకు సైతం పతకాలు
● రాష్ట్రపతి పతకాలతో విశిష్ట సేవలకు గౌరవం




2 లో

# సింధూ జలాలపై పాక్ ప్రధాని గర్జన!



2 లో

# అమరావతిలో అంతా మార్కెటింగే!

అభివృద్ధి ఎక్కడంటూ అంబటి ఫైర్
అమరావతి పేరుతో దోపిడీ?
రోడ్లకే రూ.1,519 కోట్లు!
అంచనాలు పెంచి కమీషన్లా?
అప్పులు.. అంచనాలు.. కాంట్రాక్టర్లు!
ప్రజాధనం వృథా చేస్తున్నారంటూ విమర్శ




2 లో

**న్యూస్ డెస్క్, 14 ఆగస్టు (బిఎన్ఎస్):** అమరావతి నిర్మాణం పేరుతో చంద్రబాబు నాయుడు కేవలం మార్కెటింగ్ మాత్రమే చేశారని, అక్కడ ఎలాంటి వాస్తవ అభివృద్ధి జరగలేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. అమరావతి అనేది అద్భుత నగరం కాదని, అది కేవలం అవినీతి, దోపిడీకి వేదికగా మారిందని ఆయన విమర్శించారు. రాజధానిలో మౌలిక సదుపాయాల పేరుతో ప్రజాధనాన్ని విపరీతంగా దుర్వినియోగం చేశారని అంబటి మండిపడ్డారు.

# బీసీ మహిళలకు బంపర్ ఆఫర్

1.19 లక్షల మిషన్లు ఫ్రీ
100 శాతం సబ్సిడీతో పంపిణీ
18--55 ఏళ్ల వారికి అవకాశం
వితంతువులకు తొలి ప్రాధాన్యం
ఆగస్టు 15 నుంచి దరఖాస్తులు
సెప్టెంబర్ 15 వరకు గడువు




2 లో

**న్యూస్ డెస్క్, 14 ఆగస్టు (బిఎన్ఎస్):** రాష్ట్రంలోని బీసీ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ‘ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు’ పథకాన్ని అధికారికంగా ప్రారంభించింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 శాసనసభ నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై ఉచితంగా అందించనున్నారు. ఒక్కో మిషన్ విలువ సుమారు రూ.12,000 వరకు ఉంటుంది.

# పార్టీ గీత దాటితే చర్యలు

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలోనే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తాజాగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం, పార్టీ అధిష్టానంపై ఆయన పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. విషయాన్ని ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టి తీసుకెళ్తామని అన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి నేతనైనా సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. పార్టీ గీత దాటితే ముఖ్యమంత్రితో సహా ఎవరైనా సరే అందరూ ఒకటేనని అన్నారు. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడితే ఖచ్చితంగా చర్యలుంటాయని పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, తీసుకోవాల్సిన చర్యలపై కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చిస్తాని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

అందరి కోరికలు తీర్చడం సాధ్యం కాదు..

ఎన్నికల సమయంలో మునుగోడులో ప్రచారం సందర్భంగా రాజగోపాల్ రెడ్డికి పార్టీ అధిష్టానం కొన్ని హామీలు ఇచ్చి ఉండవచ్చని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అయినప్పటికీ, పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడటానికి ఎవరికీ హక్కు లేదని అన్నారు. పదవులు, మంత్రివర్గ విస్తరణపై పార్టీ హైకమాండ్‌దే తుది నిర్ణయమని.. ఒకేరోజు అందరి కోరికలు తీర్చడం ఎంతటి వారికైనా సాధ్యం కాదని కుండబద్దలు కొట్టారు. అయితే, మంత్రివర్గంలో స్థానం లభించలేదన్న అసంతృప్తితో పాటు నియోజకవర్గానికి నిధుల కేటాయింపుపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణా కమిటీకి పంపే యోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏమన్నారంటే..!

కాగా, హైదరాబాద్ రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్తానంపై రూపొందించిన పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వం వ్యతిరేకంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్న వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని, అందుకే ఏపూరి లాంటి కళాకారులు గజ్జ కట్టాలని అన్నారు. ఏపూరి సోమన్న పాడిన.. ఎవరి పాలైందిరో తెలంగాణ పాటలోని పరిస్థితులే నేడు రాష్ట్రంలో కొనసాగడం బాధకరమని రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అభివృద్ధి పేరుతో లక్షల కోట్లు దోచుకుంటున్నారని.. అలాంటి దోపిడీదారుల వెంట పడతామని, వారి దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. మా సహనాన్ని, ఓపికను చేతకాని తనంగా భావించవద్దని, ఇన్నాళ్లు సహనంగా ఉన్నామని, ఇక పోరాటానికి సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. స్వరాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులకు, పేదలకు న్యాయం దక్కడం లేదని, అభివృద్ధి పేరిట తెచ్చిన రూ.లక్షల కోట్ల అప్పులు చేసిన నిధులు ఆంధ్ర కాంట్రాక్టర్లే దక్కుతున్నాయని విమర్శించారు. అధికారంలో ఉన్న వారు రూ.లక్షల కోట్లు దోచుకుంటుంటే పేదోడికి రూ.5 లక్షల ఇందిరమ్మ ఇంటి బిల్లుకు 500 కొర్రీలు పెడుతున్నారని తప్పుబట్టారు. హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అదేవిధంగా తాను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డును అడ్డుపెట్టుకొని అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఇండైరెక్ట్‌గా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తీరుపై రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు.

# జనగణనకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

ఈసారి రూపొందించిన 40 ప్రశ్నల ప్రశ్నాపత్రంలో కొన్ని నూతన, కీలకమైన అంశాలను పొందుపరిచారు. పౌరుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మరింత ఖచ్చితంగా అంచనా వేయడానికి కులం వివరాలతో పాటు, దేశంలో కోవిడ్ నిరోధక టీకాలు ఎంతమంది తీసుకున్నారనే సమాచారాన్ని కూడా సేకరించనున్నారు. వాటితో పాటు ఇంట్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, వినియోగిస్తున్న డిజిటల్ సాధనాలు అంటే స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్, సొంత వాహనాలు వంటి సాధారణ గృహ వివరాలు కూడా ఇందులో భాగం చేశారు.

అదేవిధంగా ఈసారి జనగణన ప్రక్రియను పూర్తి డిజిటల్ పద్ధతిలో చేపడుతున్నారు. ఎన్యూమరేటర్లు ప్రత్యేకంగా రూపకల్పన చేసిన మొబైల్ యాప్‌ల ద్వారా నేరుగా సమాచారాన్ని నమోదు చేయనున్నారు. పౌరులు కూడా తమ వివరాలను సొంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే 'సెల్ఫ్-ఎన్యూమరేషన్' వెసులుబాటును ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 1న ప్రారంభమయ్యే తొలి విడతలో ప్రధానంగా ఇళ్ల లెక్కింపు, నివాస వసతుల వివరాలు సేకరించనుండగా, ఆ తర్వాత రెండో విడతలో పూర్తిస్థాయి జనాభా గణనను చేపట్టనున్నారు.

# రేవంత్‌కు హరీశ్ స్ట్రాంగ్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం లేకపోతే మరి గోదావరి జలాలను ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా గట్టిగా ఎత్తిపోసేలా అధికారులను ఎందుకు ఆదేశిస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టులు కాళేశ్వరం వ్యవస్థలో అంతర్భాగమనే వాస్తవాన్ని ఎంత దాచాలని చూసినా సాధ్యం కాదని అన్నారు. కేసీఆర్ హయాంలో ఎల్లంపల్లి, దేవాదుల, మిడ్‌మానేరు వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం, మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించడం, భూగర్భ జలాలను పెంచడం, రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడం వల్లే రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంటలు పండాయని గుర్తుచేశారు. కాళేశ్వరం ద్వారానే ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ఆయకట్టు స్థిరీకరణకు బాటలు పడ్డాయన్నది పచ్చి నిజమని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుంద్రు..

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, సాగునీటి రంగాలపై చూపుతున్న నిర్లక్ష్యం యావత్ తెలంగాణకు శాపంగా మారిందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన వల్ల రాష్ట్రంలో గోదావరి, కృష్ణా జలాల కోసం మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయని మండిపడ్డారు. అబద్ధపు ప్రచారాలు, వ్యాసాలు, రీట్వీట్లతో రైతులను మభ్యపెట్టడం తక్షణమే ఆపాలని హితవు పలికారు.

ఈనెల 18న జీఆర్ఎంబి కార్యాలయం ముట్టడిస్తాం..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన తెలంగాణ వ్యతిరేక అంశాలను గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జిఆర్ఎంబి) ఎజెండా నుంచి తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ అంశాలను తొలగించకుండా ఈనెల 18న జరిగే జిఆర్ఎంబి సమావేశానికి హాజరైతే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడుకునేందుకు వేలాది మంది రైతులతో, శ్రేణులతో కలిసి జీఆర్ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

# అమరావతిలో అంతా మార్కెటింగే!




**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (బిఎన్ఎస్):** అమరావతి నిర్మాణం పేరుతో చంద్రబాబు నాయుడు కేవలం మార్కెటింగ్ మాత్రమే చేశారని, అక్కడ ఎలాంటి వాస్తవ అభివృద్ధి జరగలేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. అమరావతి అనేది అద్భుత నగరం కాదని, అది కేవలం అవినీతి, దోపిడీకి వేదికగా మారిందని ఆయన విమర్శించారు. రాజధానిలో మౌలిక సదుపాయాల పేరుతో ప్రజాధనాన్ని విపరీతంగా దుర్వినియోగం చేశారని అంబటి మండిపడ్డారు. కేవలం 21.77 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 1,519 కోట్లు ఖర్చు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ. 100 కోట్లతో పూర్తయ్యే రోడ్డు అంచనా వ్యయాన్ని రూ. 365 కోట్లకు పెంచడమే కాకుండా, అప్పుగా తెచ్చిన నిధుల్లోనూ కమీషన్లు దండుకున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు.

అంచనాలు పెంచి..

అప్పులు చేయడం, ప్రాజెక్టుల అంచనాలు పెంచి కాంట్రాక్టర్లకు దోచిపెట్టడమే చంద్రబాబు పాలన విధానమని మాజీ మంత్రి అంబటి దుయ్యబట్టారు. కేవలం అద్దాల కోసమే రూ. 2,500 కోట్లకు పైగా ఖర్చు చేశారని, రూ. 80 కోట్లతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని కూడా తాత్కాలికమేనని చెప్పడం ప్రజాధనాన్ని వృథా చేయడమేనని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

# స్మార్ట్ కార్డులపై పొలిటికల్ వార్



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లోనూ మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ జరగనుంది. ఈ మేరకు పంపిణీ చేయబోతున్న స్మార్ట్ రేషన్ కార్డు మోడల్ ను ప్రభుత్వం విడుదల చేసింది. కార్డుకు ఎడమవైపు సీఎం రేవంత్ రెడ్డి, కుడివైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలను ముద్రించారు. అయితే, పంపిణీ ప్రారంభానికి ముందే ఈ కార్డుల డిజైన్ రాజకీయ దుమారానికి దారితీసింది. కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో లేకపోవడంపై రాష్ట్ర బీజేపీ నాయకత్వం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది.

భగ్గుమన్న బీజేపీ:

రేషన్ కార్డులపై కేవలం సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటోలు మాత్రమే ముద్రించి, ప్రధాని మోడీ ఫోటో పెట్టకపోవడం పట్ల తెలంగాణ బీజేపీ నేతలుఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రానిదే సింహభాగమని అలాంటప్పుడు ఎవని అయ్య జాగీరు అని రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు మాత్రమే వేసుకుంటున్నారు? అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటు విమర్శలు చేశారు. ఇక పేదలకు ఉచిత రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే అందిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం తమ ప్రచారం కోసం సీఎం, మంత్రి ఫోటోలు వేసుకోవడం హాస్యాస్పదమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భవిష్యత్ లో ఈ ప్రభుత్వం దిగిపోయాక మళ్లీ కొత్త కార్డులు ఇవ్వాల్సి వస్తుందన్నారు.

సీఎం సభలో గొడవైతే మాకు సంబంధం లేదు:

ప్రధాని మోడీ ఫోటో లేకుండా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక్కో లబ్ధిదారుడికి ఇచ్చే 6 కిలోల బియ్యంలో 5 కిలోలు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోంది. అలాంటప్పుడు మోడీ ఫోటో పెట్టకపోవడం కేంద్రాన్ని అవమానించడమే అని మండిపడ్డారు. నిరసనల నడుమ సంగారెడ్డి పంపిణీ సభలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే దానికి బీజేపీని బాధ్యులను చేయవద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పని తక్కువ.. ప్రచారం ఎక్కువ సెటైర్ వేశారు. తెల్లారితే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఉండగా మోడీ ఫోటో పై చెలరేగిన పొలిటికల్ వివాదం ఎలాంటి ఉద్రిక్తతలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# పోలీసులకు సేవా పతకాలు




**న్యూస్ డెస్క్ 14 ఆగష్టు (బిఎన్ఎస్):** దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో అసమాన ప్రతిభ, ధైర్య సాహసాలు ప్రదర్శించిన పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, పౌర రక్షణ విభాగాల సిబ్బందికి కేంద్ర హోంశాఖ సేవా పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 1,057 మంది అధికారులను ఈ పతకాల కోసం కేంద్ర హోం శాఖ ఎంపిక చేయగా వీరిలో 92 మంది రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు, 301 మందికి పోలీసు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 664 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపిక అయ్యారు. గ్యాలంట్రీ పతకాలు సాధించిన 301 మందిలో అత్యధికంగా 197 మంది తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సాహసోపేత సేవలు అందించిన వారు ఉన్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన 51 మందికి, ఈశాన్య రాష్ట్రాలలోని 12 మంది పోలీసులకు ఈ పతకాలు దక్కాయి.

**తెలంగాణకు 15, ఏపీకి 21:** కాగా, ఈ ప్రతిష్టాత్మక పతకాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 21, తెలంగాణ నుంచి 15 మంది ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఎంపికైన 15 మందిలో ముగ్గురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 10 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలను అదనపు డిప్యూటీ కమిషనర్ జోగుల నర్సయ్య, ఎస్పీ ఆర్. జగదీశ్వర్ రెడ్డి అందుకోనుండగా గ్యాలంట్రీ మెడల్స్ ను జూనియర్ కమాండోలు బి. సత్యరావు, కె. సందీప్ కుమార్, జె. వంశీకృష్ణ అందుకోబోతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ పోలీసులలో ఏడుగురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 11 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఏపీకి చెందిన ఐజీ గుడి విజయ్ కుమార్, ఐజీ బలంకారి వెంకట రామిరెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపిక కాగా.. గ్యాలంట్రీ మెడల్స్ కు హెడ్ కానిస్టేబుళ్లు కొర్లాన మహేశ్, పైడి శ్రీరామమూర్తి, అదారి హేమసుందర రావు, చింతపల్లి సత్యనారాయణ, రౌతు మహేశ్, ఆబోతుల అప్పలనాయుడు, రుతాల కన్నబాబు ఎంపికయ్యారు.

**సీబీఐ అధికారులకు 21 పతకాలు:** కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)లో పనిచేస్తున్న 21 మంది అధికారులకు పతకాలు దక్కాయి. ఇందులో ఆరుగురికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 15 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. విశాఖపట్నం డీఎస్పీ(సీబీఐ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంజయ్ కుమార్ సమాల్ కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం వరించింది.

# స్వాతంత్ర్య దినోత్సవం వేళ హోంమంత్రి కాన్వాయ్ పై దాడి.. భద్రతా సిబ్బంది మృతి



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (బిఎన్ఎస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ పాకిస్థాన్ లో హోంమంత్రి కాన్వాయ్ పై దాడి జరిగింది. ఈ కాల్పుల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది మరణించగా.. మరో ఆరుగురు పోలీసులు తీవ్రంగా గాయపడినట్లు పాక్ మీడియా తెలిపింది. ఈ ప్రమాదం నుంచి మంత్రి సురక్షితంగా బయటపడినట్లు పేర్కొంది. మంత్రి జియా లంగో కాన్వాయ్ కలాత్ నుంచి క్వెట్టా వైపు వెళ్తుండగా.. ఖడ్కోచా ప్రాంతంలోని గురు వద్ద పొంచి ఉన్న సాయుధ దుండగులు ఒక్కసారిగా విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ క్రమంలో పోలీసులు-దుండగుల మధ్య దాదాపు 20 నిమిషాల పాటు ఎదురుకాల్పులు కొనసాగాయి. ఘటన అనంతరం దాడికి పాల్పడిన నిందితులు అక్కడి నుంచి పరారవ్వగా, వారిని పట్టుకోవడానికి భద్రతా దళాలు ఆ ప్రాంతంలో భారీగా గాలింపు చర్యలు చేపట్టాయి.

పోలీసు సిబ్బంది అత్యంత ధైర్యసాహసాలతో దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టారని బలూచిస్థాన్ హోం వ్యవహారాల అసిస్టెంట్ బాబర్ యూసుఫ్ జాయ్ కొనియాడారు. మస్తుంగ్‌లోని నవాబ్ ఘౌస్ బఖ్ష్ రైసానీ ఆసుపత్రి ఎమర్జెన్సీ ఇన్‌చార్జ్ సనా మాలిక్ మాట్లాడుతూ, ఈ ఘటనలో గాయపడిన ఆరుగురు సిబ్బందిని ఆసుపత్రికి తరలించామని, వారిలో మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని క్వెట్టాకు తరలించినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై హోం మంత్రి జియా లంగో స్పందిస్తూ.. ఇలాంటి పిరికిపందల దాడులకు తమ మనోధైర్యం దెబ్బతినదని, ఇటువంటి తుపాకీ పేలుళ్లు చూసి తాను భయపడేది లేదని స్పష్టం చేశారు.

# బీసీ మహిళలకు బంపర్ ఆఫర్




**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (బిఎన్ఎస్):** రాష్ట్రంలోని బీసీ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని అధికారికంగా ప్రారంభించింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 శాసనసభ నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై ఉచితంగా అందించనున్నారు. ఒక్కో మిషన్ విలువ సుమారు రూ.12,000 వరకు ఉంటుంది. అయితే, తాజాగా ఈ పథకానికి సంబంధించి విధివిధానాలు, లబ్ధిదారులకు ఉండాల్సిన అర్హతలను ప్రకటించింది. 18 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉన్న బీసీ నిరుద్యోగ మహిళలు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. కుటుంబ వార్షిక రాబడి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదనే నిబంధన పెట్టారు. ఒక కుటుంబానికి ఒకే కుట్టు మిషన్ మాత్రమే మంజూరు చేయనున్నారు.

వారికే ఫస్ట్ ప్రియారిటీ..

'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకంలో భాగంగా వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, వికలాంగులు, ముందే కుట్టు పనిలో అనుభవం, నైపుణ్యం ఉన్నవారికి లబ్ధిదారుల ఎంపికలో మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అర్హత కలిగిన మహిళలు ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్ వివరాను తెలంగాణ ప్రభుత్వ అధికారిక పోర్టల్ https://tgobmms.cgg.gov.in/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

# సింధూ జలాలపై పాక్ ప్రధాని గర్జన!



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (బిఎన్ఎస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు యావత్ భారతదేశం సిద్ధమవుతోన్న వేళ పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సింధూ నదీ జలాల ఒప్పందం అంశంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. పాక్‌కు కేటాయించిన ప్రతీ నీటి బొట్టును తాము కాపాడుకుంటామని, తమ నీటి వాటాను ఉల్లంఘించేందుకు ఎలాంటి ప్రయత్నం చేసినా నేరుగా సమాధానం ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరింపులకు దిగారు. ఇస్లామాబాద్‌లో నిర్వహించిన 'యాద్గార్-ఎ-ఫతే' ప్రారంభోత్సవ కార్యక్రమంలో షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. పాకిస్తాన్‌కు నీరు అనేది 'రెడ్ లైన్' అని అభివర్ణించిన ఆయన, సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘించడం ద్వారా ప్రాంతీయ శాంతికి శత్రువుగా మారిందని ఆరోపించారు.

ప్రతీ నీటి బొట్టు తమకు రెడ్ లైన్, ప్రత్యర్థికి నేరుగా సమాధానం ఇస్తామని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. తాము శాంతిని కోరుకుంటున్నామని, యుద్ధాన్ని కోరుకోవడం లేదని, అయితే తమ శాంతి కాముకతను బలహీనతగా భావించవద్దని ఆయన హెచ్చరించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ఆర్మీ చీఫ్, డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ ఆసిమ్ మునీర్ కూడా ఉన్నారు.

# పెట్టుబడులకు గ్లోబల్ పిలుపు

మొదటి పేజీ తరువాయి



అభివృద్ధి చేసే ప్రణాళికలు, మౌలిక వసతుల అవకాశాలను పెట్టుబడిదారుల ముందుంచేలా ప్రత్యేక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు.

తెలంగాణలో డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా, ఐటీ, గ్రీన్ ఎనర్జీ, తయారీ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచ దేశాలకు ప్రదర్శించనున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, స్టార్టప్‌ల విజయాలను కూడా అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది.

కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వివిధ రంగాల్లో తెలంగాణకు చెందిన సంస్థలు, స్టార్టప్‌లు సాధించిన విజయాలతో పాటు వినూత్న ఉత్పత్తులు, ఆవిష్కరణలను ప్రదర్శించే ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను కూడా ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0లో ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రానికి మరిన్ని భారీ పెట్టుబడులను తీసుకురావడం, పరిశ్రమల విస్తరణకు అనుకూల వాతావరణాన్ని ప్రపంచానికి తెలియజేయడం ఈ సమ్మిట్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ద్వారా కొత్త పెట్టుబడి ప్రతిపాదనలకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# హిందువుల పైకి హైడ్రా... పాతబస్తీకి ఉచిత కరెంటా?



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (బిఎన్ఎస్):** ఓల్డ్ సిటీలో మైనారిటీలు కరెంట్ బిల్లులు కట్టరనే ఆరోపణలు ఉన్నాయని, తమ ప్రభుత్వం వచ్చాక అమలు చేస్తున్న 200 యూనిట్ల పథకం వల్ల ఎక్కువగా మైనారిటీలకే లబ్ధి చెందుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు మండిపడ్డారు. ఎక్స్ వేదికగా పోస్టు చేసిన ఆయన.. 'పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని తెలంగాణ సీఎం అన్నారు. ఇదే మీ ప్రభుత్వ విధానం అయితే.. నిబంధనలు పాటించలేదనే కారణంతో హైడ్రా చర్యలు తీసుకుంటున్నప్పుడు పేద కుటుంబాల విషయంలో ఇదే సానుభూతిని ఎందుకు చూపడం లేదు?' అని ప్రశ్నించారు.

హిందుకుటుంబాలపై సానుభూతి ఏది?:

ఒకవైపు సీఎం పేద హిందూ కుటుంబాలపై నిబంధనల ఉల్లంఘన పేరుతో హైడ్రాను ప్రయోగిస్తూ మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడాన్ని సమర్థించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. హిందూకుటుంబాలపై ఆ సానుభూతి ఏదని నిలదీశారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను బుజ్జగించే రాజకీయాల చేయడంలో ఖిలాఫత్ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో మారలేదని దుయ్యబట్టారు.

# స్థానిక సంస్థల ఎన్నికల లక్ష్యం కూటమి జెండా ఎగరవేయడమే.!!

**• ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి - యల్లటూరు శ్రీనివాస రాజు**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 14:

భాకరాపేటలో పుత్తా రామచంద్రయ్య ఏర్పాటు చేసిన తేనీటి కార్యక్రమంలో పాల్గొన్న జనసేన రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనను ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజు కూటమి కార్యకర్తలను ఉద్దేశించి తెలుపుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేస్తే అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కూటమి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టి కృషి చేయాలని కోరారు. స్థానిక సంస్థలపై ఎన్డీఏ కూటమి జెండా ఎగురవేసేలా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజల మద్దతు లభించేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కూటమి నేతలు రాజంపేట పార్లమెంట్ టిడిపి మాజీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గ సీనియర్ టిడిపి నేత పుత్తా రామచంద్రయ్య ఇచ్చిన తేనీటి కార్యక్రమంలో నాయకులు కొమర వెంకటనరసయ్య, మామిళ్ళ ఈశ్వరయ్య, కిరణ్ స్వామి, రామ్మోహన్ నాయుడు, పామూరు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, పుత్తా బాలయ్య, పెద్దపల్లి టిడిపి మాజీ యూనిట్ ఇంచార్జి కడితం రామమోహన్ నాయుడు, భాకరాపేట టిడిపి నేతలు పుత్తా చలపతి, పుత్తా ఎల్లయ్య .సిద్దవటం మండల తెలుగు యువత అధ్యక్షులు పుత్తా సుధీర్ రాయల్, సిద్దవటం టిడిపి మాజీ యూనిట్ ఇంచార్జి పుత్తా శివానంద, మైనారిటీ నేత సత్తార్ బాషా, బిసినేత జజల బాబు గౌడ్, బాలచంద్ర ,పుల్లయ్య, సుబ్బయ్య, గంగాధర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు అరుదైన గౌరవం



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 14: వైఎస్ఆర్.. కడపజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ దేశంలోని అత్యుత్తమ పోలీసు నాయకత్వాన్ని గుర్తించే ఫేమ్ ఇండియా ఆసియా పోస్ట్ సంస్థల 2026 ఎంపికలో భారతదేశంలోని 100 మంది ఉత్తమ పోలీసు చీఫ్‌లలో ఒకరిగా స్థానం సంపాదించడం గర్వించదగిన విషయం. సమర్థవంతమైన పోలీసింగ్, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా భద్రత, ప్రజలకు అనుకూలమైన పోలీసు పరిపాలన పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతకు ఈ గుర్తింపు విశిష్టమైన ప్రశంస. పోలీసు నాయకత్వం, నేర నియంత్రణ, ప్రజల విశ్వాసం, పారదర్శకత, నూతన విధానాల అమలు, నిర్ణయాత్మక నాయకత్వం, సంక్షోభ నిర్వహణ మరియు ప్రజలకు పోలీసుల స్పందన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఎంపిక జరిగినట్లు సంస్థలు పేర్కొన్నాయి.

**వృత్తి నైపుణ్యంతో కూడిన నాయకత్వం**

కడపజిల్లా ఎస్పీగా షెల్కే నచికేత్ విశ్వనాథ్ వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, సమర్థవంతమైన పర్యవేక్షణ మరియు క్షేత్రస్థాయి పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించడం, సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించేలా చూడటం, పెట్రోలింగ్‌ను బలోపేతం చేయడం, ప్రజల ఫిర్యాదులపై వేగంగా స్పందించడం వంటి చర్యల ద్వారా ప్రజలకు మరింత చేరువై, బాధ్యతాయుతమైన పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. నివారణాత్మక పోలీసింగ్‌కు కూడా ఆయన ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీలు, సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడం, పెట్రోలింగ్‌ను బలోపేతం చేయడం, అత్యవసర సేవలకు పోలీసుల స్పందనను పర్యవేక్షించడం వంటి చర్యలు జిల్లా పోలీసుల పనితీరును మెరుగుపరుస్తున్నాయి.

**మహిళలు, బాలలు మరియు బలహీన వర్గాల భద్రత**

ఎస్పీ నచ్చికేత్ నాయకత్వంలో మహిళలు, బాలలు మరియు సమాజంలోని బలహీన వర్గాల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజలకు అనుకూలమైన పోలీసింగ్ అంటే కేవలం నేరాలను నియంత్రించడం మాత్రమే కాకుండా, బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించడం, వారికి అందుబాటులో ఉండటం మరియు వారి సమస్యలపై తక్షణమే స్పందించడం కూడా.

**కడప జిల్లా ప్రజల అభినందనలు**

భారతదేశంలోని 100 మంది ఉత్తమ పోలీసు చీఫ్‌లలో ఒకరిగా ఎంపికైన వైఎస్ఆర్ కడపజిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్‌కు కడపజిల్లా ప్రజలు హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలు మరియు సమాజ శ్రేయస్సు కోసం ఆయన అందిస్తున్న సేవలకు ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని, భవిష్యత్తులో కూడా ఆయన మరెన్నో ఉన్నత విజయాలు సాధించాలని కడపజిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# 2 రోజుల పాటు ప్రజలందరికీ ఏపీ అసెంబ్లీలోకి అనుమతి!




బిఎన్ఎస్: స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఏపీ ప్రజలకు, విద్యార్థులకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అద్భుతమైన కానుకను ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వంటి పండుగ వేళల్లో ప్రజలకు, స్కూలు పిల్లలకు చట్టసభ ప్రాంగణంలోకి ప్రవేశం లేకపోవడం మంచిది కాదని ఆయన అనుకున్నారు. పబ్లిక్ రాని చోట కేవలం విద్యుత్ దీపాల అలంకరణలు పెట్టి ఉత్సవాలు చేయడం వల్ల ఉపయోగం లేదని స్పష్టం చేసిన స్పీకర్, అసెంబ్లీ అనేది ప్రతి ఒక్కరిది అనే ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ మనసభ -- జనసభ ప్రతిపాదనకు శ్రీకారం చుట్టారు.

ఈ నిర్ణయం ప్రకారం, ఆగస్టు 14 , 15 తేదీల్లో అసెంబ్లీ ప్రధాన గేట్లను ప్రజలందరి కోసం తెరిచి ఉంచుతారు. ఎలాంటి ముందస్తు అనుమతులు , పాస్‌లు లేకుండా ఎవరైనా సరే నేరుగా వచ్చి అసెంబ్లీని తిలకించవచ్చని స్పీకర్ వెల్లడించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాధారణ ప్రజలతో పాటు పాఠశాల విద్యార్థులు చట్టసభ లోపల , ప్రాంగణాన్ని సందర్శించే వెసులుబాటు కల్పించారు. అయితే, భద్రతా నిబంధనల దృష్ట్యా అసెంబ్లీ హాలు లోపలికి మాత్రం మొబైల్ ఫోన్లను అనుమతించరని, ప్రాంగణంలో ఫోన్లను వాడుకునేందుకు వెసులుబాటు ఉంటుందని వివరించారు.

సందర్శకుల అనుభవాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు సాయంత్రం వేళల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలను మంత్రముగ్ధులను చేసే పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు , ప్రత్యేక ఫుడ్ కోర్టులను ప్రాంగణంలో అందుబాటులో ఉంచుతున్నారు. అంతేకాకుండా, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అసెంబ్లీ సందర్శనకు రాకపోకలు సాగించేందుకు వీలుగా సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు లేఖ కూడా రాసినట్లు స్పీకర్ వెల్లడించారు.

గతంలో ఎన్టీఆర్ చెప్పిన మనసభ -- జనసభ నినాదానికి అనుగుణంగా ప్రజలను చట్టసభలకు మరింత దగ్గర చేయడమే ఈ వినూత్న ప్రయత్నం యొక్క ముఖ్య ఉద్దేశమని స్పీకర్ తెలిపారు. ప్రజాస్వామ్య దేవాలయమైన శాసనసభను కళ్లారా చూసి, వేడుకలను ప్రత్యక్షంగా తిలకించేందుకు లభించిన ఈ అరుదైన అవకాశాన్ని ప్రజలందరూ, ముఖ్యంగా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

### మహిళలే వైఎస్సార్‌సీపీకి

# అసలైన మూలస్తంభాలు.!

**• రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం అంటున్న కడపజిల్లా వైఎస్ఆర్సిపి నాయకులు.**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 14: కడప నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా మహిళా సమావేశం నిర్వహించబడింది. కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు తెలుగుపులి వెంకటసుబ్బమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం ఎస్బి.అంజద్ బాషా, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి,కడప నగర అధ్యక్షులు దీప్తిరెడ్డి, ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కమిటీ సభ్యులు, రాష్ట్ర మహిళా కమిటీ సభ్యులు, నియోజకవర్గ అధ్యక్షురాళ్లు మండల మహిళా అధ్యక్షురాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేశారు.

**మహిళలే శక్తి స్వరూపులు**

ఒక ప్రభుత్వాన్ని నిలబెట్టాలన్నా, కూలదోయాలన్నా అది కేవలం మహిళల శక్తితోనే సాధ్యమని పలువురు మహిళ వైఎస్ఆర్సిపి నాయకులు పేర్కొన్నారు.

జగనన్న పాలనలో మహిళా సాధికారత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు రాజకీయ, ఆర్థిక రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వారికి సముచిత స్థానం కల్పించిన ఘనత మన వైయస్సార్సీపి పార్టీకే దక్కుతుంది అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తూ రాష్ట్రంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను మహిళలే స్వయంగా గడపగడపకూ ఎండగట్టి, ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. 2029 లక్ష్యంగా పెట్టుకొని రానున్న 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడంలో మహిళలే కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మహిళలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, వారి సంక్షేమానికి పూర్తి భరోసా కల్పిస్తామని నాయకులు ఈ కార్యక్రమంలో మహిళలకు హామీనిచ్చారు.

# రాపూరు వెంకటేశ్వర మహల్‌లో కుటుంబ సమేతంగా 'పాంచాలి పంచభర్తక ' చిత్రాన్ని వీక్షించిన నిర్మాత దిగిరెడ్డి వెంకట్ రెడ్డి




నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):-నేడు గ్రాండ్ గా థియేటర్లలో విడుదలైన 'పాంచాలి పంచభర్తక ' చిత్రాన్ని వీక్షించేందుకు రాపూరు లోని వెంకటేశ్వర మహల్ థియేటర్ సందడిగా మారింది. ఈ చిత్ర నిర్మాత దిగిరెడ్డి వెంకట్ రెడ్డి గారు తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేకంగా వెంకటేశ్వర మహల్ లోనే ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు.

సినిమా ప్రదర్శన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ ఆనందాన్ని, అనుభూతిని పంచుకున్నారు

సినిమా మొదటి ఆట నుంచే మంచి స్పందన వస్తోందని, ముఖ్యంగా రాపూర్ ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.వినోదాత్మక చిత్రం నిర్మించమని ప్రేక్షకులకు నచ్చే విధంగా, కుటుంబ సమేతంగా థియేటర్ కు వచ్చి నవ్వుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించామని తెలిపారు.ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్క నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతో కష్టపడి పనిచేయడం వల్లే ఈ రోజు సినిమాకు ఇంతటి మంచి టాక్ వస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రేక్షకులు తమ కుటుంబంతో కలిసి ఈ సినిమా చూసి ఆనందించి చిత్ర యూనిట్ ను ఆశీర్వదించాలని కోరుతున్నామన్నారు

# మొక్కలు నాటండి.. ప్రకృతిని ఆస్వాదించండి..

**• జమ్మలమడుగు రూరల్ సీఐ కుళ్లాయప్ప**

**• స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటిన పోలీసులు..!!**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 14: ఆగస్టు15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మైలవరం మండలం, తలమంచిపట్నం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు రూరల్ సిఐ. కుళ్లాయప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ. హైమావతి, పోలీస్ సిబ్బంది, డాల్మియా సంస్థ ఉద్యోగులతో కలిసి పోలీస్ స్టేషన్ పరిసరాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజల్లో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పోలీసులు పిలుపునిచ్చారు.

### వృద్ధ బ్రాహ్మణ కుటుంబానికి

# అండగా మంత్రి నారా లోకేష్



కొత్తపేట (బిఎన్ఎస్) ఆగస్టు:14 కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఆవిడి గ్రామానికి చెందిన ఓ వృద్ధ బ్రాహ్మణ కుటుంబం దీనస్థితిని తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ మానవత్వంతో స్పందించారు. గ్రామానికి చెందిన రామమూర్తి అనే 65 ఏళ్ల వృద్ధుడు, ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర అవస్థలు పడుతున్న విషయం మంత్రి దృష్టికి వచ్చింది.

వృద్ధ దంపతుల దయనీయ పరిస్థితిని తెలియజేస్తూ వచ్చిన వీడియోను చూసిన మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి, ఆ కుటుంబానికి అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. తక్షణ సహాయం అందించడంతో పాటు, కుటుంబానికి అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంత్రి ఆదేశాలతో అధికారులు, స్థానిక నాయకులు ఆ వృద్ధ బ్రాహ్మణ కుటుంబాన్ని పరామర్శించి అవసరమైన సహాయాన్ని అందించారు. తమ పరిస్థితిని తెలుసుకుని మంత్రి నారా లోకేష్ స్పందించడంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆపదలో ఉన్న పేద, వృద్ధ కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

# ట్యాక్స్ చెల్లించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సీజ్




రావులపాలెం (బిఎన్ఎస్ )ఆగస్టు 14 :ఈతకోట టోల్ ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం జిల్లా రవాణాశాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 32 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను పరిశీలించగా, ట్యాక్స్ చెల్లించని ఒక బస్సును సీజ్ చేశారు. ఇతర నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 10 బస్సులపై కేసులు నమోదు చేసి మొత్తం రూ.2,40,800 అపరాధ రుసుము విధించారు.ఈ సందర్భంగా జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులు, నిర్వాహకులు రవాణాశాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అతివేగం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు పాల్పడే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా ప్రయాణికుల వ్యక్తిగత బ్యాగేజీ మినహా వాణిజ్యపరమైన కమర్షియల్ లగేజీని అనుమతులు లేకుండా తరలిస్తున్న బస్సులు పట్టుబడితే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతులు లేకుండా నడుపుతున్న బస్సులు, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు ఓలేటి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, షణ్ముఖ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.అనుమతులు లేని బస్సులు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై జిల్లా రవాణాశాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది.

# హనుమంత్ షిండే జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా,పిట్లం: కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పిట్లంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మద్నూరుకు వెళ్లి హనుమంత్ షిండేను కలిసి కేక్ కట్ చేయించి, శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్


# తాళ్లపాక అభివృద్ధికి కృష్ణంరాజు చేసిన కృషి అమోహం.!

## కీ.శే. బాలరాజు కృష్ణంరాజుకు ఘన నివాళి



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 14:

తాళ్లపాక అభివృద్ధికి, అన్నమయ్య సాహిత్య ప్రాచుర్యానికి ఆయన సేవలు చిరస్మరణీయం అంటూ జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు.

రాజంపేట మండలం.. తాళ్లపాక గ్రామానికి చెందిన ప్రముఖుడు, అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్లపాక అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన కీ.శే. బాలరాజు కృష్ణంరాజు జయంతి సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజు ఘన నివాళులర్పించారు. శుక్రవారం తాళ్లపాకలో కీర్తిశేషులు బాలరాజు కృష్ణంరాజు విగ్రహానికి గ్రామస్తులు, ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి యల్లటూరు శ్రీనివాసరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు సమాజానికి అందించిన సేవలను, తాళ్లపాక అభివృద్ధికి చేసిన కృషిని ఆయన స్మరించుకున్నారు.

పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్లపాక అభివృద్ధికి కృష్ణంరాజు చేసిన కృషి ప్రశంసనీయమని, అన్నమయ్య కీర్తనలను టీటీడీ ఆధ్వర్యంలో విస్తృతంగా వెలుగులోకి తీసుకురావడంలో ఆయన పాత్ర విశేషమని యల్లటూరు పేర్కొన్నారు. ఆయన సేవా స్ఫూర్తి, ఆశయాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత మాజీ జెడ్పిటిసి యల్లటూరు శివరామరాజు, బాలరాజు చక్రధర్ రాజు, గూడూరు శ్రీనివాసరాజు, రుద్రరాజు నాగేశ్వరరాజు, ఎ.రామ్ గోవిందరాజు, బాలరాజు సుమన్ రాజు, ఎర్రంరాజు సురేష్ రాజు, బాలరాజు రాజశేఖర్ రాజు, రామేటి సుబ్బరాజు, సమ్మెట ఉమాపతి, రేనాటి సుబ్బరాజు, శంకర్ రాజు, బాలరాజు వసంతరాజు, రాకేష్ రాజు, గడి సుబ్బరాజు, ఎర్రగుడి శంకర్ రాజు, చిన్నమరాజు, రామచంద్ర రాజు, సమ్మెట తిరుమల, గూడూరు చంద్ర, గూడూరు రంగస్వామిరాజు, చొక్కారాజు శ్రీనివాసరాజు, గెడి నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మలమడుగు లో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర ర్యాలీ.

## ర్యాలీలో పాల్గొన్న బిజెపి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 14:

80 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కడపజిల్లా.. జమ్మలమడుగు పట్టణంలో స్థానిక బిజెపి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు, పురుషులు, ప్రజా భాగస్వామ్యంతో జాతీయ జెండాలను చేతభూని హర్ ఘర్ తిరంగా యాత్ర ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యాలీ పట్టణ పరిధిలోని శ్రీ నారాపురం వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర నుంచి ప్రారంభమై, మెయిన్ బజార్ మీదుగా, పాత బస్టాండ్ భారత జాతి పితామహుడు గాంధీ విగ్రహం వరకు తిరంగా యాత్ర ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఎంతోమంది మహనీయులు స్వాతంత్రం కోసం పోరాడి ఈరోజు స్వేచ్ఛ స్వాతంత్రాన్ని తీసుకురావడంలో జాతిపిత మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, భగత్ సింగ్, నెహ్రూ లాంటి మహా నాయకులతో పాటు స్థానికంగా ఎద్దుల ఈశ్వర్ రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి లాంటి నాయకులు స్వాతంత్ర సమర పోరాటంలో పాల్గొన్న గడ్డ మన జమ్మలమడుగు అని, నేటికీ స్వాతంత్రం 79 సంవత్సరాలు పూర్తి చేసుకుని 80 వ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమం జరుపుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిజమైన స్వాతంత్రం అంటే జమ్మలమడుగు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 24 గంటల కరెంటు, ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం, ప్రతి ఇంటికి స్వచ్ఛ భారత్ పేరుతో మరుగుదొడ్లుతో పాటు ఈరోజు డాలర్ విలువ పెరిగి వృద్ధిరేటు గణనీయంగా పెరగడం. ఇదే నిజమైన స్వాతంత్రానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో చదిపిరాళ్ళ శివ నారాయణరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, తెలుగుదేశం, బిజెపి, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఖర్గే పర్యటించిన స్థలం శుద్ధిపై ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ఆగ్రహం

## ఇది దళితుల వ్యక్తిత్వానికి జరిగిన అవమానం-బిజెపిపై ఫైర్



బిఎన్ఎస్ న్యూస్ వరంగల్/ఆగష్టు 14

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కు అవమానం జరిగిందంటూ బిజెపిపై వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్.నాగరాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాఖండ్ లోని హల్ద్వానిలో ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని బిజెపి,హిందుత్వ సంస్థలు గంగాజలంతో శుద్ధి చేయడాన్ని నాగరాజు తీవ్రంగా ఖండించారు. ఇది దళితుల వ్యక్తిత్వానికి జరిగిన అవమానమని విమర్శించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,వరంగల్ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ లతో కలిసి వరంగల్ వెంకట్రామ జంక్షన్ నుండి కాశీబుగ్గ అంబేద్కర్ జంక్షన్ వరకు అర్ధనగ్న ప్రదర్శన చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన యాత్రలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేశారు. ఇది బిజెపి కుల దురహంకారానికి, దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని నాగరాజు అన్నారు."రామ రామ అంటే పుణ్యమొస్తుంది, అంబేద్కర్ ను స్మరించుకుంటే ఏమొస్తుంది" అని అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అమిత్ షా దేశ ద్రోహిగా వ్యవహరిస్తున్నారని, దళితులను అణగదొక్కాలనే నినాదంతో బిజెపి పనిచేస్తుందని ఆరోపించారు. రామ్ లీలా మైదానంలో ఖర్గే అడుగుపెట్టిన స్థలాన్ని శుద్ధి చేయడం బిజెపి పాటిస్తున్న అంటరానితనానికి, అసమానతలకు అద్దం పడుతుందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలు,రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని,వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు స్పందించాలని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు, చైర్మన్లు, డివిజన్ అధ్యక్షులు,సర్పంచులు, నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

## జాతీయ జెండాలతో కదం తొక్కిన విద్యార్థులు, బీజేపీ నాయకులు -- దేశభక్తి నినాదాలతో మార్మోగిన ర్యాలీ



బిఎన్ఎస్ ,ఏటూరునాగారం ఆగష్టు 14

ఏటూరునాగారం మండలం జడ్పీఎస్ఎస్ పాఠశాలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆదేశాల మేరకు శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కొండగొర్ల రాంబాబు, ఉపాధ్యక్షులు దుర్గం దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సిఆర్పీఎఫ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జాడి రామరాజు హాజరై జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాలు చేతపట్టి, దేశభక్తి నినాదాలు చేస్తూ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనడంతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఏటూరునాగారం జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థుల పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశ స్వాతంత్ర్యం, జాతీయ సమైక్యత, దేశభక్తి స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, జాతీయ ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పలక గంగ, మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రేమలత, మహిళా నాయకురాళ్లు మలకం స్వరూప, మలకం రవళి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిచర్ల రాజశేఖర్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్దన్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఇర్సవడ్ల జగన్, మండల ఉపాధ్యక్షులు అటిక కృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రల్ల ఎల్లయ్య, బజరంగ్ దళ్ సభ్యులు, పాఠశాల అధ్యాపకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కన్వీనర్ దుర్గం శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల భద్రతకు 'వన్ మినిట్ రూల్' రక్షణ కవచం



బిఎన్ఎస్ న్యూస్ జాఫర్‌గడ్ ఆగస్టు 14

విద్యుత్ సిబ్బంది భద్రతకు 'వన్ మినిట్ రూల్' విధానం రక్షణ కవచంలా పనిచేస్తుందని ఎన్పీడీసీఎల్ డీఈ (ఆపరేషన్) బి. సారయ్య అన్నారు. ప్రతి ఒక్కరూ పనులు ప్రారంభించే ముందు ఒక నిమిషం భద్రత గురించి ఆలోచించి, జాగ్రత్తలతో విధులు నిర్వహించాలని సూచించారు. జాఫర్‌గడ్ మండల కేంద్రంలోని ఎన్పీడీసీఎల్ ఏఈ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ సిబ్బందితో భద్రత, విద్యుత్ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఈ ఘనపూర్ పి. రణధీర్‌రెడ్డితో కలిసి సమావేశాన్ని నిర్వహించిన డీఈ సారయ్య మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణకు సిబ్బందితో పాటు వినియోగదారులు కూడా సహకరించాలని కోరారు. భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు వినియోగదారులు సిబ్బందికి సమాచారం అందించి, వారు వచ్చే వరకు వేచి ఉండాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టవద్దని హెచ్చరించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉన్నతాధికారుల సహకారంతో పలు విద్యుత్ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఈ తెలిపారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం నూతన విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణాలు చేపడుతూ ఓవర్‌లోడ్, లో-వోల్టేజ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం విద్యుత్ సిబ్బందితో భద్రతా నియమాల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఈ కరుణాకర్, ఫోర్‌మెన్ జావీద్, లైన్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మారెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మల్లికార్జున స్వామి ఆటో యూనియన్‌కు నూతన కార్యవర్గం

## ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం



బిఎన్ఎస్ న్యూస్ జఫర్గఢ్ ఆగస్టు 14

జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం ఉప్పుగల్లు గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల కార్యక్రమంలో యూనియన్‌కు చెందిన ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా పెండ్యాల బిక్షపతి ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా గుజ్జరి జగదీష్, కార్యదర్శిగా బంధువుల స్వామి, కోశాధికారిగా నాయిని బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారులుగా బైరి రాజు, గంగాధర్, యాదగిరి, బైరు రంజిత్, యాట రమేష్, శివరాత్రి సతీష్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, యజమానుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ అభివృద్ధితో పాటు సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఎన్నిక పట్ల యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు.

# కుంచపర్తి హెల్త్ సెంటర్‌ను సందర్శించిన సర్పంచ్ స్పందన"



సత్తుపల్లి/వేంసూరు, ఆగస్టు14(బిఎన్ఎస్) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల కుంచపర్తి గ్రామంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ స్పందన రాకేష్ సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల ప్రభావం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచుగా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని స్పందన రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో: సెకండ్ ఏ ఎన్ ఎం అరుణ,ఆశ వర్కర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన అధ్యక్షుని ఎన్నిక





స్టేషన్ ఘనపూర్, బిఎన్ఎస్,ఆగస్టు 14:

స్టేషన్ ఘనపూర్ మండలంలోని పాముసూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కమిటీ ఏర్పాటుకై గ్రామ సర్పంచ్ పోలేపల్లి సంపత్ రెడ్డి పిలుపు మేరకు గ్రామ కాంగ్రెస్ నాయకులు పాండురంగనాథ స్వామి దేవాలయం వద్ద సమావేశమయ్యారు. ఈ సమావేశం మండల నాయకులు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి అధ్యక్షతనలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నాయకులు నూకల బాల్ రెడ్డి, జిల్లెల సిద్దారెడ్డి,మండల నాయకులు నాగరబోయిన శ్రీరామ్, పురమాని రజాక్ యాదవ్ లు పాల్గొనడం జరిగింది. పాముసూరు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులుగా బండ రాజేందర్ నియమితులయ్యారు. గ్రామశాఖ అధ్యక్షున్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి,జిల్లా అధ్యక్షురాలు ధన్వంతి త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తారని జూలుకుంట్ల శిరీష్ రెడ్డి తెలియజేశారు. ఈ సమావేశంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ కోతి రాములు, మాజీ ఎంపీటీసీ ఇనుగాల రాజిరెడ్డి, వంగ సారయ్య, బత్తిని రవి,పొన్న గట్టయ్య,బత్తిని రాజు, నాయకులు,గ్రామస్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి - ఎస్పీ స్నేహ మెహ్రా




బిఎన్ఎస్ :వికారాబాద్ జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో శాంతిభద్రతలు, కేసుల పురోగతి మరియు నేర నియంత్రణ చర్యలపై జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సమీక్షించారు. ఫైళ్లను స్వయంగా పరిశీలించిన ఆమె, కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా నిందితులకు శిక్షలు పడేలా చూడాలని, సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, CCTNS, e-Sakshya వంటి సాంకేతిక వ్యవస్థలను సరిగ్గా వినియోగించుకోవాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ఈ సందర్భంగా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు.